# స్నేహంలో పలికిన అపశ్రుతి

"నమ్మమంటావా?......" సిగరెట్ పొగ వదులుతూ సాలోచనగా నా కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు శేఖరం.

నేను దాస్తున్నాననీ, దానిని నా ముఖంలో, కళ్ళల్లో చదువుకుందామనీ శేఖరం ప్రయత్నిస్తున్నట్లనిపించింది.

"నీకు నమ్మకం కలగకపోతే నేనేం చేయను— నలుగురితోపాటు నీవూ అనుకుంటావు" అని పొడిగా నవ్వేశాను.

"మీ ప్రవర్తన అనుమానించ తగ్గదిగా లేదంటావా?"

"ఉండచ్చు..."

"అయితే నీకూ ప్రమీలకూ ఉత్తి స్నేహమేనంటావ్?"

"ఎన్నిసార్లు చెప్పమంటావ్:" అంటూ లేచాను.

ఇద్దరం కౌంటర్ దగ్గరకు వచ్చాము. నేను బిల్లు చెల్లించబోతుంటే వద్దని శేఖరమే చెల్లించాడు. ఇద్దరం మౌనంగానే కొంత దూరం వచ్చాం.

"మళ్ళీ కలుస్తామో, లేదో రాత్రి ట్రైనుకు వెళ్ళిపోతాను" అన్నాడు శేఖరం.

"సరే-ఉత్తరాలు వ్రాస్తుండు" అనిచెప్పి, అప్పుడే వచ్చి స్టాప్‌లో ఆగిన బస్సులోకి ఎక్కాను

శేఖరానికి, నాకూ ఉన్న బంధుత్వంకంటే స్నేహమే యెక్కువ ఏదో ఆఫీసు పనిమీద వచ్చాడు. స్నేహితులు పలుగురూ అనుకొనే మాటలువిని నన్ను మందలించబోయాడు. అతనికి నా మీద అంత స్వతంత్రం ఉంది. నా మాటలు నమ్మినట్టే ఉంది. లేకపోతే అంత తొందరగా వదిలేవాడు కాదు.

సాయంత్రం ఆఫీసునుంచి బయలుదేరబోతుండగా ప్రమీల ఫోన్ చేసి చెప్పింది ఆబిడ్స్ తాజ్ దగ్గిర కలుసుకుందామని. నా సమాధానానికి ఎదురు చూడకుండానే రిసీవర్ పెట్టేసింది.

"వెళ్ళడమా - మానడమా" అనుకుంటూ ఆఫీసునుంచి బయటకు వచ్చాను.

"ఎంత నమ్మకం లేకపోతే సమాధానమైనా వినకుండా రిసీవర్ పెట్టేస్తుంది?... నాలుగు రోజులైంది కలుసుకొని. ఏమైనా తగిలేముందేమో" అనుకున్నాను.

నేను రిక్షా దిగేటప్పటికి అప్పుడే అటునుంచి వచ్చి ఆగిన రిక్షాలోంచి చిరునవ్వుతో దిగింది ప్రమీల.

"నా జవాబు వినకుండానే రిసీవర్ పెట్టేశావేం?" అన్నాను.

సింగరాజు లింగమూర్తి

ప్రమీల నవ్వేసి "ముందేమైనా టిఫిన్ పడాలి. ఆకలి దంచేస్తున్నది! రండి ... " అంటూ హోటల్లోకి దారి తీసింది.

టిఫిన్ చేస్తూ మళ్ళీ అదే ప్రశ్నించాను.

"రానంటే ... "

"ఏం నేను రాకపోతే ... ?"

"క్రొత్తగా మాట్లాడుతున్నారే ఇవ్వాళ... మనసేం బాగుండలా, పిక్చర్‌కు పోదాం."

నేనెప్పుడూ ఆమెను "నీవు" అనే అంటాను. ఆమె మాత్రం ఎంత చనువుగా మాట్లాడుతున్నా "మీరు" అని మన్నిస్తూనే ఉంటుంది.

"ఇంత స్నేహంలో "మీరు" అనకపోతేనేం?" అంటాను.

"ఏమో బాబూ, మీ మీద గౌరవం నన్నలా అననీయదు" అంటుంది ప్రమీల.

మా ఇద్దరి స్నేహంలో ఏ అరమరికలూ లేవు. ఏ రహస్యాలూ లేవు. మా సంభాషణలలో అన్ని విషయాలతో పాటు సెక్సుకు సంబంధించినవీ ఉంటాయి.

"సెక్స్ అంతా ఒకటే కదా ఆడవంటే ఎందుకు పడిచస్తారో నాకు అర్థంకాదు" అంటుంది ప్రమీల.

"మరి ఆడవాళ్ళెందుకు పడిచస్తారంటావ్ - మగాళ్ళంటే?"

"మీరేమైనా అనండి - మగాడిలా ఆడది తెగబడదు."

"మగవాడు మట్టుకు తెగబడతాడా - మాటల్లో బైటపడతాడు. ఆడది బైటపడదు. అంతే తేడా ... కాకపోతే మగవాడికున్న అవకాశాలు ఆడదానికి లేకపోవచ్చు"

ఈ ధోరణిలో సాగుతుంటాయి మా చర్చలు. మేము వాదన పెంచుకోము. రాజీపడుతూ ఒక సమాధానానికి వస్తాము.

"మాట్లాడరేం - ఏ పిక్చర్‌కు పోదాం?" అని మళ్ళీ ప్రమీలే పలుకరించింది.

"నీ ఇష్టం, దేనికైనా సరే!" అన్నాను లేస్తూ.

హాల్లో కూర్చున్నాక "ఏం - మనసెందుకు బాగుండలేదు?" అని ప్రశ్నించాను.

"ఏముందీ — మామూలే ... పోనిద్దురూ — దానికేంగాని ఏమైనా కబుర్లు చెప్పండి" అంది నవ్వుతూ.

"ఈ నాల్గురోజుల్లో కొత్త కబుర్లేం ఉంటాయి.

"కథేం మొదలెట్టలా?"

"నీ గురించే వ్రాయాలనుకుంటున్నా..."

"ఏ ముందేం నన్ను గురించి వ్రాయడానికి?" కాటుక రెప్పలెత్తి కళ్ళల్లోకి చూస్తూ అంది.

"అదుగో, అలాగే చూడవద్దంది."

వెంటనే "సారీ" అంటూ రెప్పలు వాల్చేసుకుంది.

తెరమీద బొమ్మలు కదిలిపోతున్నాయి. కొంతసేపు ఇద్దరం కబుర్లు మాని సినిమా చూడటంలో మునిగాం.

ఇంతదూరం వచ్చాక ప్రమీలగురించీ, నా గురించీ చెప్పకపోవడం భావ్యం కాదనుకుంటా.

మా ఇద్దరి పరిచయం చిత్రమైంది కాకపోయినా అసహజమైందిమాత్రంకాదు. మొదట్లో మాకు ఉత్తరాల ద్వారానే పరిచయం. నా రచనలు కొన్ని చదివి వాటిని ఎంతో మెచ్చుకుంటూ ఉత్తరాలు వ్రాసింది. అది చివరకు కలం స్నేహంగా మారింది. సమాజం తీరుతెన్నుల గూర్చి ఏవేవో సందేహాలు ఆమె వెలిబుచ్చుతూండేది. సాహిత్యంపట్ల ఎంతో అనురక్తి కనబరిచేది. ఏవో నాకు తోచిన సమాధానాలు ఇస్తూండేవాడిని. ఆమె వ్రాసిన కొన్ని కొన్ని ఉత్తరాల్లో జీవితంమీద ఎంతో నిర్లక్ష్యం, నిర్వేదం ధ్వనించేది

"నేను బహుశ: త్వరలో నే మీ ఊరు రావచ్చు. అక్కడ ఉద్యోగం వచ్చేటట్లుగా ఉంది. అప్పుడు మనం తరచు కలుసుకొని మాట్లాడుకుంటూ ఉండచ్చు"నని ప్రమీల ఒక ఉత్తరంలో వ్రాసింది.

అంతవరకెపుడూ ప్రమీలను చూడాలని పించలేదు. కాని ఆ ఉత్తరం చదువుకున్నాక ఆమెను చూడాలనే తహతహ ఎక్కువైంది. ఆమె ఉత్తరాలను బట్టి ఆమె ఇలా ఉండవచ్చునని ఒక రూపాన్ని మనస్సులో చిత్రించుకున్నా. నా ఊహ నిజమౌనోకాదో తెలుసుకుందామనేమో ఆ తహతహ.

[illegible] వెళ్ళగానే [illegible] వచ్చింది." అంది [illegible]

"[illegible]"

"[illegible] అలాగే ఉత్తరాల్లో వ్రాస్తుంది [illegible]." అంది నవ్వుతూ.

"ఓహో!... మరి ఆమేదేది?"

"కాస్త గుడ్డలు కుట్టెయ్యాలండి. మరీ అంత తొందరైతే ఎట్లా? మళ్ళీ ఓ అరగంటలో వస్తుంది లెండి."

"ఎలా ఉంటుందావిడ?"

"వయి ఆవిడ ఎలా ఉంటే మీకెందుకు?"

"అహఁ-అందుక్కాదు..."

"ఎందుక్కాదు!" కొంటెగా చూస్తూ ప్రశ్నించింది శ్రీమతి.

"పోనీ చెప్పకు"...

"తినబోతూ రుచులెందుకండీ! ... మరో అరగంటలో ఆమెను చూడనే చూస్తారుగా" అని లోపలకు వెళ్ళింది శ్రీమతి.

సామెత బాగానే ఉందిగాని, మరో ఉద్దేశం పెట్టుకొని ఈవిడ ఇలా మాట్లాడటంలేదు కదా అనుకున్నాను.

"నిజమే...ప్రమీల ఎలా ఉంటే నాకేం?" అనుకున్నాను. కాని మనస్సు ఎందుకో ఆమె మీది ఆలోచనలతో నిండి పోయింది.

బట్టలు మార్చుకొని ముఖం కడుక్కొని వచ్చేటప్పటికి శ్రీమతి కాఫీ తెచ్చి బల్లమీదపెట్టి "ప్రమీలను రాత్రికిక్కడే భోజనానికి ఉండమని చెప్పాను-" అంది.

"ఉహూఁ... మీ ఇద్దరికీ అప్పుడే బాగా స్నేహం అయినట్టుందే." అన్నాను కాఫీ సిప్ చేస్తూ.

"మా ఆడవాళ్ళం నిమిషంలో స్నేహం చేసుకుంటాం."

"అంత సులభంగానూ జుట్టూజుట్టూ పట్టుకో గలరు కూడా. అది మరచిపోకు"

చురుక్కున చూసి గదిలోంచి వెళ్ళిపోయింది శ్రీమతి.నేనేదో పుస్తకం తెరిచాను కాలక్షేపానికి.

పదిహేను నిమిషాలు బరువుగా గడిచాయి. ఇంటి ముందు రిక్షా ఆగిన చప్పుడవుతే లేచి కిటికీలోంచి తొంగిచూశాను. రిక్షాలోంచి ప్రమీల దిగుతూ నన్ను చూసి చిరునవ్వు చిందించింది. పుస్తకాలమీద, పత్రికలలోనూ నా బొమ్మ చూసి ఉంటుంది కాబట్టి వెంటనే గుర్తించి ఉంటుంది. కాస్త కుడిఎడంగా నేను ఊహించినట్టుగానే ఉంది ప్రమీల.

చామనచాయ. కోలముఖంలో కాటుక కళ్ళు కోటికాంతులు చిమ్ముతున్నట్లు ఉంటాయి. అందమైందనే చెప్పాలి. కాటుక రెప్పలెత్తి తొలిసారిగా నా వైపు చూసినప్పుడే వాటిని ముద్దు పెట్టుకోవాలనే లౌల్యం ఉట్టిపడింది నాలో.

ప్రమీల మెట్లెక్కుతుంటే మా శ్రీమతి ఎదురు వెళ్ళినట్టుంది. ఆమె చెయ్యి పట్టుకొని గదిలోకి తీసుకువచ్చింది.

"నమస్కారమండీ!" చేతులు జోడించి కాటుక రెప్పలెత్తి నా కళ్ళల్లోకి చూస్తూ అంది ప్రమీల. సూటిగా ఆ కళ్ళల్లోకి చూడలేక "రండి-కూర్చోండి"అన్నాను ప్రక్కకు చూస్తూ. మా శ్రీమతి ఓ అయిదునిమిషాలు కూర్చుని "ఇద్దరూ మాట్లాడుతుండండి-తొందరగా వంట పూర్తి చేసేస్తా" అంది లేస్తూ.

"నన్ను గూడా సహాయం రమ్మంటారా?" అంది ప్రమీల.

"ఈ మాత్రం వంటకి మీ సహాయం ఎందుకండీ!..." అని వెళ్ళిపోయింది శ్రీమతి.

"ఎప్పుడొచ్చారు?-ఏమిటండీ సంగతులు?" అని ప్రస్తావన ప్రారంభించాను.

ప్రమీల వచ్చి నాలుగు రోజులైందట. వాళ్ళబాబాయిగారింట్లో దిగాననీ, వచ్చిన మరునాడే ఉద్యోగంలో ప్రవేశించాననీ చెప్పింది. ఎక్కడైనా గది చూసుకొని విడిగా ఉండి వండుకు తింటుందట. తెలిసినచోట ఎక్కడైనా ఓ గది కుదిర్చిపెట్టమంది. ఉత్తరాల్లో వ్రాసిన విషయాలనే కొన్ని పునశ్చరణ చేసింది. ఇంతలో మా శ్రీమతివచ్చి భోజనాలకు లెమ్మంది.

భోజనాల ముందరకూడా ప్రమీల ఏవో కబుర్లు చెబుతూ నవ్విస్తూనే ఉంది. చాలా కలివిడిగా సరదాగా ఉండే మనిషి అని

పించింది. భోజనాలయ్యాక ఓ పదినిమిషాలు కూర్చుని ప్రమీల వెడతానని బయలుదేరితే రోడ్డుదాకా వెళ్ళి రిక్షా ఎక్కించి వచ్చాను.

ఆ రోజు నుంచి ప్రమీల నేనూ కలుసుకుంటూనే ఉన్నాము. ప్రమీల ఎక్కువగా మా ఇంటికి రావడం, నాతో సన్నిహితంగా ఉండడం మా శ్రీమతికి అంత ఇష్టంలేనట్టు పసిగట్టాను. స్త్రీ సహజమైన అసూయ చదువుకున్న ఆడ వాళ్ళలో కూడా ఉంటుందేమో. స్పష్టంగా అనకపోయినా మా ఇద్దరినీ అనుమానిస్తున్న దని కూడా గ్రహించి నవ్వుకున్నాను. ప్రమీల కూడా అర్థం చేసుకున్నట్టుంది. మా ఇంటికి రావడం తగ్గించేసింది.

"ఏం- వెనకటిలా మా ఇంటికి రావడం లేదేం?" అన్నాను ఒకసారి ప్రమీలతో.

"నేను రావడం ఆమెకు ఇష్టంలేనట్టుంది. వచ్చి ఆమెకు బాధ కలిగించడం ఎందుకు లెండి" అంది.

ఆ విషయమై ఇంకా నేను లోతుకు పోద లచుకోలేదు. మా శ్రీమతినీ కూడా ఏమీ అడగ దలచుకోలేదు.

రోజులు దొర్లిపోతున్నాయి. ప్రమీల ఓ చోట గది కుదుర్చుకొని ఉంటున్నది.

"రెండురోజుల కొకసారైనా వచ్చి పోతుం డండి బాబూ. లేకపోతే నాకేం తోచేద్వదు."అంది ప్రమీల.

"సరే - వస్తాలే." అన్నాను.

మేం మాట్లాడుకుంటుంటే ఆ త్మీయుల్లా మాట్లాడుకుంటున్నట్లు ఉంటుంది. ఇంచుమించు నా దినచర్యలో ఆమెను కలుసుకోడం కూడా ఓభాగమైపోయింది.


ఓరోజు నేను ప్రమీల ఇంటికి వెళ్ళేప్పటికి ఎంతో ఉదాసీనంగా కనిపించింది.

"ఏమిటలా ఉన్నావ్?"

నా పలకరింపుతో ఆమెలో అణగి ఉన్న దుఃఖం పెల్లుబికి వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఏమైంది ప్రమీలా, ఎందుకేడుస్తున్నావ్? ఇంటివగ్గిరి నుంచి ఉత్తరం వచ్చిందా? మీ అమ్మావాళ్ళు అంతా కులాసా?" అని ఆదుర్దాగా ప్రశ్నించాను.

ఆమె తల అడ్డంగా తిప్పింది. కాని ఇంకా కళ్ళల్లో నీళ్ళు చెక్కిళ్ళమీదుగా జారుతూనే



ఉన్నాయి. నాకేం అర్ధంకాలా. అప్రయత్నం గానే దగ్గరకు వెళ్ళి "నతో చెప్పకూడదా?.... నావల్ల మీకే సహాయం కావాలన్నాచేస్తా... చెప్పవూ!" అంటూ ఆమెచేతులు పట్టుకున్నాను. ప్రమీల ఒకసారి నా ముఖంలోకిచూసి చేతులు విడిపించుకొని దూరంగా జరుగుతూ "ఏంలేదు-ఏదో జ్ఞాపకం వచ్చింది." అంది పమిటచెంగుతో కళ్ళు ఒత్తుకుంటూ.

"సరైతే - అంత రహస్యమైతే నీలోనే దాచుకో!" అన్నాను వచ్చి కుర్చీలో కూర్చుంటూ.

"ఉండండి-ఇప్పుడేవస్తా" నంటూ ప్రమీల లోపలకు వెళ్ళి ముఖం కడుక్కొని, బట్టలు మార్చుకొని టాయిలెట్ అయి వచ్చింది.

"మనసేం బాగుండలా; సినిమాకు వెడదాం వస్తారా?" అంది.

ఆమెకై ఆమె సినిమాకు రమ్మనడం కాస్త ఆశ్చర్యమే కలిగింది.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?... నాతో రావడానికి సందేహిస్తున్నారా?"

"అది నే ననాల్సినమాట; పద వెడదాం" అని లేచాను.

హాల్లో కూర్చున్నాక "ఏం - మనసెందుకు బాగుండలా?" అన్నాను.

ప్రమీల కాటుక రెప్పలెత్తి నా కళ్ళల్లోకి చూసింది.

"అలా చూస్తే నా మనస్సు విలవిల్లాడి పోయింది..."

"ఏం?"

"నీకు తెలియదా?"

"ఊహూ..."

"నీ కాటుక కళ్ళు ముద్దుపెట్టుకోవాలని పిస్తుంది..."

"ఇంకానయం..." అంటూ ప్రమీల కాస్త ప్రక్కకు జరిగి "క్షమించండి-నా చూపుల్తో మిమ్మల్ని రెచ్చగొట్టినట్లయితే...ఇంకెప్పుడూ అలా చూడనులెండి...మనం ఏ పరిస్థితిల్లోనూ హద్దులు దాటిపోకూడదని నా ప్రార్థన... మనం ఇలా స్నేహంగా ఉందాం...... ఈ స్నేహం అపవిత్రం కాకూడదు...ఏదీ—ఆలాగని చేతిలో చెయ్యివెయ్యండి." అని చెయ్యిచాచింది. అప్రయత్నంగానే చేతిలో చెయ్యివేశాను. "మీరు నవ్వుతూ మాట్లాడుతూంటే నాకూ అనిపిస్తుంది - కాని నిలదొక్కుకుంటాను....మన బలహీనతలను మనలోనే చంపుకోవాలి. నిగ్రహంకోల్పోతేనలగురులా మనమూ అవుతాము ...... మన స్నేహానికో విశిష్టత ఉండాలి." అంది ప్రమీల నాచేతిని తన చేతిలోనే ఉంచుకొని నిమురుతూ.

"అది సాధ్యమంటావా, ఇంత సన్నిహితం లోకి వచ్చాక..."

"సాధన చేద్దాం"

"మనో వ్యభిచారం మహాపాపం!... దానంత చిత్రవధ ఇంకోటి లేదేమో..."

"నిగ్రహించుకోడం అలవరచుకుందాం. అందులోనే ఘనతఉంది. ఏనాడైతే మనలో ఎవరం నిగ్రహం కోల్పోతామనిపిస్తుందో అనాటినుంచే మనం కలుసుకోడం మానేద్దాం."

సినిమా అయిందాకా నాకు ముళ్ళమీద కూర్చున్నట్టే ఉంది. హాల్లోంచి బయటకు వస్తూ "ఇంతకూ నీ సంగతేం చెప్పలేదు" అన్నాను. "ఇంకోసారి చెబుతాలెండి" అని తప్పించుకుంది ప్రమీల.

ప్రమీల తల్లి, అన్నగారు చెల్లెళ్ళు మద్రాసులో ఉంటున్నారు. మద్రాసులాంటి మహానగరంలో ఆమెకు ఉద్యోగం దొరక్కపోయిందా అని మీకు సందేహం కలగవచ్చు. మీకేమిటి నాకే మొదట్లో సందేహం కలిగి తీర్చుకున్నాను.

అవిభక్త మద్రాసు రాష్ట్రంలో సుందరావనే యువకుడు ఓ ప్రభుత్వ శాఖలో పని చేస్తుండేవాడు. ఆ రోజుల్లోనే ప్రమీల ఆ శాఖలో తాత్కాలికోద్యోగినిగా చేరింది. ఇంకేముంది- వాళ్ళిద్దరూ ప్రేమాయణంలో పడ్డారు. సుందరావు అప్పుడప్పుడు ప్రమీల ఇంటికి కూడా వెడుతుండేవాడు.

కట్నం లేకుండా అల్లుణ్ని సంపాదించుకోవచ్చుకదా అని ప్రమీల తల్లి వాళ్ళ స్వేచ్ఛా విహారాలకు అంతరాయం కలిగించ లేదు. వీళ్ళ సాన్నిహిత్యం ఎలా పరిణమిస్తుందోనని అన్న

కొంత అనుమానించినా తల్లి యిచ్చిన ధైర్యంతో పట్టించుకోలేకపోయాడు. చివరకు అతను అనుమానించిందే నిజమయ్యేప్పటికి మండిపోయాడు.


సుందర్రావు ఇద్దరు కన్నెమనసులను దోచుకొని వాళ్ళ నైతిక పతనానికి కారకుడయ్యాడు. మూడోసారి మరో కన్నె పడుచుకు గాలం వేశాడు. అది బెడిసికొట్టేప్పటికి ఆ పిల్ల మెళ్ళో పుస్తె కట్టక తప్పిందికాదు. ఆమె పుట్టింటికి వెళ్ళిన రోజుల్లోనే ప్రమీల అతాఫీసులో చేరడం, సుందర్రావు వలవేయడం, ఆ వలలో ప్రమీల ఇరుక్కోవడం జరిగింది. ప్రమీల తాను మోసపోయానని తెలుసుకొనేటప్పటికి మోకాలిలోతు ఊబిలోకి దిగబడినట్లనిపించింది "అయిందేమో అయింది ఇక మన జాగ్రత్తలో మనం ఉండటం మంచిది" అన్నారు తల్లి అన్నగారు.

"అదంత సులభం కాదమ్మా! చేసుకుంటే ఆయన్నే చేసుకుంటా లేకపోతే మరెవర్నీ చేసుకునేది లేదు" అని కచ్చితంగా చెప్పేసింది ప్రమీల. కూతురి భవిష్యత్తు ఇలా బండలు కావడానికి తానెంతవరకు బాధ్యురాలో తలచుకొని కుమిలిపోయింది తల్లి.

ఇంతలో ఆంధ్రప్రదేశ్ అవతరించడంతో మద్రాసులోని కొన్ని ఆంధ్ర కార్యాలయాలు తరలి వచ్చాయి. ఆ తరలి వచ్చిన వారిలో సుందర్రావొకడు. అతణ్ణి కళ్ళతోనైనా అప్పుడప్పుడు చూసుకుంటుండవచ్చు. ఎప్పటికైనా అతని మనస్సు కరగడా తననుకూడా భార్యగా స్వీకరించడా అన్న ఆశతో ప్రమీల ఇక్కడ ఉద్యోగం వెతుక్కొని వచ్చింది ఇదీ-ప్రమీలకు సంబంధించిన పూర్వ వృత్తాంతం.

"నీ మనోనిశ్చయం బాగానే ఉంది కాని అతను నిన్ను చేసుకోనేమాట ఉత్తది. మనం బహుభార్యాత్వ నిషేధయుగంలో ఉంటున్న సంగతి మరచిపోయారా?" అన్నాను.

"ఇందులో రచ్చకెక్కాల్సిందేముంది



ఆయన నలుగురిముందూ కాకపోయినా గుడిలో దేవుడిముందు పుస్తె కట్టినా చాలు" అంటుంది ప్రమీల.

అక్కడికి నేను సుందర్రావుతో పరిచయం చేసుకొని ప్రమీల విషయం ఎత్తితే అతను చిరాకుపడ్డాడు.

"నాకు పెళ్ళి అయింది—ఒక బిడ్డ కూడా. ప్రమీలను చేసుకోమని మీరు ఎలా చెప్పగలుగుతున్నారో నాకు బోధపడటం లేదు." అన్నాడు.

"మరి ప్రమీలను ఎందుకు మభ్యపెట్టావ్ ?" అన్నాను.

"మీ కంటే ఆమె గురించి నాకు బాగా తెలుసు ... లాంటిది ప్రమీల. ప్రస్తుతం మీ మీద వాలింది. మీ ఇద్దరి స్వేచ్ఛా విహారాలు నాకు తెలియవనుకున్నారా." అన్నాడు.

ఇంకేం మాటాడుతాను అతనితో.

ఓ రోజు ఆఫీసు నుంచి వస్తుంటే ఒక పరిచయస్థుడు కనిపించి "ఏం బ్రదర్ ఈ మధ్య కనిపించడం లేదు. నిన్న బజారులో కనిపిస్తే పలుకరిద్దామనుకున్నాను కాని ప్రక్క మీ ఆవిడ ఉండగా అని పిలువలేదు" అన్నాడు. అతనికేదో సమాధానం చెప్పి బయలుదేరాను.

ప్రమీల నా ప్రక్కన నడుస్తున్నప్పుడు మా శ్రీమతి ఏమరో తెలియని వాళ్ళు అలా అనుకోవడంలో అసహజం అనిపించలా. ఇలా అనుకుంటున్నారని ప్రమీలతో అంటే "పోనీ అనుకోనివ్వరూ...మనలో ఆ ఉద్దేశం లేనప్పుడు ఏమనుకుంటే యేం" అని నవ్వేసింది నిర్లక్ష్యంగా.

"అది మన ఉభయులకూ మంచిదికాదేమో! ...ముఖ్యంగా నీ భవిష్యత్తు..."

"నేను అసలు భవిష్యత్తు ఉందనుకుంటేగా-భయపడటానికి...మీరు భయపడుతున్నట్టుంది."

నిజమే...నాకు కొన్ని పరిధులున్నాయి. రచయితగా కొన్ని బాధ్యతలున్నాయి. అవి దాటిపోలేను. మన ఇద్దరి స్నేహం నిష్కల్మషమైందే! కావచ్చు. మన స్నేహంలో నైచ్యం లేకపోవచ్చు కాని చూసేవాళ్ళు మేం అవినీతి పరులం కామంటే నమ్ముతారా ?...

పళ్ళ బిగువుమీద వారంరోజులు ప్రమీలను కలవకుండా నుసిలాను. ఈ వారంరోజుల్లో ఏ పెయ్యిపొర్లో ప్రమీల జ్ఞాపకం వచ్చింది. ఆ రోజు ఆఫీసు ఆవరణ దాటి బైటకు వచ్చేప్పటికి ప్రమీల పనిమనిషి కనిపించి చీటీ అందించింది

"నేనేం పాపం చేశానని రావడంలేదు? ఒక్కసారి దర్శనం ఇప్పించరూ!" ఆ వాక్యాలు నా అంతరాంతరాలను కదిలించి వేశాయి

"సరే-నీవు వెళ్ళు! అన్నాను.

నేను వెళ్ళేప్పటికి ప్రమీల శాలువ కప్పుకొని పడుకొని ఉంది. ముఖం వడిలిపోయి చాలా నీరసంగా కనిపించింది. కుర్చీ మంచం దగ్గరకు లాక్కొని కూర్చుంటూ "ఏం ఒంట్లో బాగుండటం లేదా!" అన్నాను.

"నాలుగు రోజులనుంచి జ్వరం వేస్తున్నది బాబూ! మందు తెచ్చుకోవమ్మా అంటే ఒద్దు పొమ్మంది" అని పనిమనిషి చెప్పింది.

"ఏమిటిది ప్రమీలా మందుతీసుకోకపోతే జ్వరం ఎలా తగ్గుతుంది?

"ఏం తగ్గకపోతే...నేను బ్రతకాలని ఎవరికుంది?... ఎవరికోసం బ్రతకాలి?

"ఒకరి కోసం ఒకరు బ్రతకక్కరలేకపోయినా, నీ కోసం నీవు బ్రతకాలి...పోనీ ఎవరికి లేకపోయినా నాకుంది నీవు బ్రతకాలని."

"అందుకోసమేనేమో, వారం రోజులైనా ఏమైందోనని కూడా కనుక్కోలేదు." నిష్ఠూర్యంగా అంది ప్రమీల

ఏమిటిది - చేసుకున్న భార్యలా సాధింపులు అనిపించింది.

"నీవు ఒక ప్రక్కే ఆలోచిస్తున్నావుగాని రెండో ప్రక్క ఆలోచించడం లేదు...పోనీ ఈయనెందుకు రాలేకపోయాడోనని నీవైనా రావచ్చుగా...ఇలా ఒంట్లో బాగుండలేదని మొదట్లోనే ఎందుకు కబురు పెట్టలేదూ ?" అన్నాను.

"ఏ రోజు కారోజు మీరు వస్తారేమోనని ఎదురు చూసేదాన్ని...ఇక ఇవ్వాళ్ళ ఉండబట్టలేక పనిమనిషిని పంపాను ... ... ఏదో



దురుసుగా అన్నట్టున్నాను ఏమీ అనుకోరు గదూ!" జాలిగొలిపేట్టు చూస్తూ అంది.

"నేను ఎల్లానమ్మా పొద్దోయింది" అని చెప్పి పనిమనిషి వెళ్ళిపోయింది.

"లేడీ డాక్టర్ దగ్గరకు వెడదాం."

"మీరు తీసుకు వెళతారా? ...ఎవరంటే ఏం చెప్తారు? ... వద్దులెండి - అదే తగ్గిపోతుంది."

"పోనీ జ్వరం తగ్గిందాకా వచ్చి మా ఇంట్లోనే ఉండండి."

"వద్దు...ఆమెకు అసలే మనమీద అనుమానం...ఈ పరిస్థితిలో మీ ఇంటికి వస్తే ఆమె అనుమానానికి ఇంకా బలం వస్తుంది. మీ ఇద్దరి మధ్య లేనిపోని కలతల్ని రేపడం నాకు ఇష్టం లేదు."

"మరైతే డాక్టర్ దగ్గరకు పోదాంపద..."
భుజం పట్టుకొని లేవదీశాను.

అనివారం రోజుల్లో మామూలు మనిషైంది ప్రమీల.

ఆమెలోని అసంతృప్తిని మరవడానికీ, సరదాలు తీర్చుకోవడానికీ ప్రమీల నాతో చనువుగా సినిమాలకీ, షికార్లకీ వస్తున్నదా అనిపించింది ఒకసారి.

"మరి నా సంగతేమిటి?" అని ప్రశ్నించుకున్నా. ఇదమిద్ధంగా ఏమీ చెప్పుకోలేకపోయాను. బహుశః అందితే అవకాశం జారవిడుచుకుంటాడా అని కొందరనుకోవచ్చునేమో కాని నాలోనూ అజ్ఞాతంగా ఏ అసంతృప్తో ఉండేమోననిపించింది.

ఆ రోజు సాయంత్రం ఆఫీసు నుంచి వస్తూ ప్రమీల ఇంటికి వెళ్ళాను. ఆమె ఏవో టిఫిన్ పెట్టి కాఫీ యిచ్చింది. నేను కాఫీ తాగుతుంటే ఆమె జడవేసుకుంటూ కబుర్లు చెబుతున్నది. బయటినున్న చల్లటిగాలి కొడుతున్నది. ఆమె తలలో తురుముకుంటున్న మల్లెచెండు సువాసనల్ని గుప్పురిస్తున్నది. కిటికీలోంచి చూసి "వాన వచ్చేట్టుగా ఉంది" అన్నాను. నా మాట పూర్తి కాకుండానే మిన్ను విరిగి మీద పడుతుందా అన్నట్టు ఫెళ ఫెళార్భాటం చేసింది ఆకాశం.

"ప్రాణానికి హాయిగా ఉంది...వర్షం పడనీయండి ... చక్కటి వాతావరణం...పాట పాడాలనిపిస్తున్నది" అంది ప్రమీల అద్దం ముందు ముంగురులు సరిచేసుకుంటూ.

"ఇంకేం పాడు; నీ పాట ఎప్పుడూ విననే లేదు" అన్నాను.

ప్రమీల పాట ప్రారంభించడం బయట వర్షం పడటం కూడా పలుకున్నట్టు జరిగాయి.

ఆమె అంత శ్రావ్యంగా, మధురంగా పాడుతుందనుకోలేదు. ఆ భావగీతం చాలామంది పాడగా విన్నాను కాని, ప్రమీల ఆ గీతానికి ఎంచుకున్న రాగం, బాణీ సరిపోయినట్టున్నాయి.

బయట వర్షం ఉధృతంగా పడుతున్నది. కిటికీలోంచి జల్లుపడుతుంటే రెక్కలు మూసివేసింది ప్రమీల.

"ఇంకో పాట..." అన్నాను.

రాగం అందుకుంది ప్రమీల.


గదిలో కరెంటు పోయింది. గదిలోనే కాదు. వీధి అంతా పోయినట్టుంది.

"చచ్చాం- ఇప్పుడే ఈ లైట్లు పోవాలా ... మీదగ్గర అగ్గిపెట్టె లేనట్టుంది... ఆ అలమారలో చూడండి..." అంది ప్రమీల.

"ఎటువైపుంది అలమారా :"

"మీరు కూర్చున్న కుడివైపు..."

లేచి తడుముకుంటున్నాను చేతికి అరమర తగలడం లేదు. "ఎక్కడుందో కనిపించడం లేదు, నీవే చూడు" అన్నాను.



ప్రమీల చీకటిలో అలమారవైపు తడుము కుంటూ అడుగులు వేస్తున్నది. బయట వర్షం కుండపోతగా పడుతున్నది. ఎక్కడో పిడుగు పడుతూ గర్జించింది.

"ఏమండీ ఎక్కడున్నారు?...నాకు భయ మేస్తున్నది..." అంది ప్రమీల.

"అగ్గిపెట్టి దొరకక్క!"

"అసలు అలమార కనిపిస్తేగా..."

ఎలాగో తడుముకుంటూ ఆమె నా దగ్గరకు వచ్చింది. మళ్ళీ ఆకాశం ఫెళఫెళలాడింది. ఆమె గట్టిగా నా చెయ్యి పట్టుకున్నది.

"ఈ మాత్రానికే ఇంత భయపడతావేం?"

"మీకేం మగాళ్ళు..." అంటూ ప్రమీల మరింత దగ్గరగా జరిగింది.

స్పర్శ సుఖం ఇద్దర్నీ కాల్చివేస్తున్నది. ఆమె తలలోని మల్లెలు గుబాళిస్తున్నాయి మత్తు ఊదుతున్నట్టు. అప్రయత్నంగానే నా చెయ్యి ఆమె నడుమును చుట్టివేసింది. ప్రమీల అభ్యంతర పరచలేదు అంత చీకటిలోనూ ఆమె కాటుక కళ్ళు మెరుస్తున్నట్లనిపించింది. మనస్సులో అణచుకున్న భావానికి తీవ్రత కలిగింది. ఆ కళ్ళను ముద్దుపెట్టుకున్నాను. ఆమె గాఢంగా నన్ను హత్తుకొని పెదాలు ముద్దాడింది. మమ్మల్ని హెచ్చరిస్తున్నట్లు హఠాత్తుగా గదిలో లైట్లు వెలిగాయి. ప్రమీల కౌగిలి వదిలి దూరంగా జరిగి అరచేతుల్లో ముఖం దాచుకొని ఏడుస్తూ మంచంమీద చతికిలపడింది.

ప్రమీల ఏడుస్తూనే నా చెయ్యి పక్కకునెట్టి "మనం పూర్తిగా ఓడిపోకముందే భగవంతుడు మేల్కొల్పాడు" అంది.

"నిజమూ...మేం ఓడిపోలేదు" అని గొణుక్కుంది. కాని "ఓడిపోయారు" అని ఆత్మ ఘోషిస్తుంటే ఎలా సంతృప్తిపడను.

"వర్షం కాస్త తగ్గినట్టుంది-నేను వెళతాను" అన్నాను.

ప్రమీల ఏమీ మాట్లాడలేదు తలుపు దగ్గరగా వేసి వీధిలోకి వచ్చాను.

ఆమెను ఎలా ఓదార్చాలో అర్థంకాలా. నెమ్మదిగా ఆమెదగ్గరకు వెళ్ళి "పొరపాటు జరిగింది; ఇద్దరం ఉద్రేకపడ్డాం" సానుంగానయ తల నిమురుతూ అన్నాను.

"నేను ఇక్కడినుంచి వెళ్ళిపోతున్నాను. ఇక్కడే ఉంటే మనం విగ్రహం కోల్పోతామని భయంగా ఉంది...ఎక్కడున్నా మీ స్నేహాన్ని మరచిపోలేను. మన స్నేహం చిరస్మరణీయంగా ఉండిపోవాలనే నేను వెళ్ళిపోతున్నాను.... ఈ స్మృతిలో జీవితమంతా గడిపేయగలనని పిస్తున్నది. మీకు ఎలా కృతజ్ఞతలు చెప్పాలో తెలియడంలేదు-మీ ప్రమీల."

రెండోరోజు పోస్టులో ఆఫీసు అడ్రసుకు ప్రమీల వ్రాసిన ఉత్తరం చదువుకొనేటప్పటికి కళ్ళు చమర్చాయి. మా స్నేహంలో పలికిన అపశృతిని ఎలా మరచిపోవడం! ★

